సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



టన్ను చీనీ రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 934 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
42.5°/22.6°

జిల్లా పరిధిలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి. వేసవితాపం, వడగాల్పుల తీవ్రత ఎక్కువైంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

మడకశిర టీడీపీలో గందరగోళం

- టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సునీల్
- ఎంఎస్‌రాజును టీడీపీ ఎంపిక చేసినట్లు సోషల్ మీడియాలో హల్‌చల్



మడకశిరలో ఉన్న ఎంఎస్ రాజు ప్రచార రథం

మడకశిర: సార్వత్రిక ఎన్నికల వేళ మడకశిర టీడీపీలో గందరగోళం నెలకొంది. టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌ను మారుస్తున్నారని, మడకశిర నుంచి టీడీపీ తరఫున ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు బరిలో దిగుతున్నాడని రెండు రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీ క్యాడర్ గందరగోళంలో పడింది. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్‌ను ఇప్పటికే టీడీపీ అభ్యర్థిగా ప్రకటించగా, ఆయన నెలరోజులుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తాజాగా శుక్రవారం టీడీపీ తరఫున నామినేషన్ కూడా వేశారు. అయితే శుక్రవారం సాయంత్రమే మడకశిరలో ఎంఎస్ రాజు చిత్రాలతో కూడిన టీడీపీ ప్రచార రథాలు కనిపించడంతో అభ్యర్థి మార్పు వార్తలకు బలం చేకూరుతోంది. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఒత్తిడి మేరకు అభ్యర్థిని మారుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గం మాత్రం టీడీపీ హైకమాండ్ తమకే అనుకూలంగా ఉందని, అభ్యర్థి మార్పు ఉండబోదని చెబుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అసలు టీడీపీ అభ్యర్థి ఎవరో తెలియక కార్యకర్తలు ఆయోమయంలో పడిపోయారు.


చింతపండు @ రూ.20 వేలు



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు శుక్రవారం గరిష్టంగా రూ.20 వేలు పలికింది. మార్కెట్‌కు 871 క్వింటాళ్ల చింతపండు రాగా, ఈ–నామ్‌లో వేలం వేసినట్లు కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.9 వేల ప్రకారం పలికిందన్నారు. అలాగే ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.10,300, కనిష్టంగా రూ.4,200 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

పచ్చ మృగాళ్లు



''ఆడది కనిపిస్తే ముద్దైనా పెట్టాలి...కడుపైనా చేయాలి..కమిట్ అయిపోవాలి అంతే'' అంటూ హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యాఖ్యానించారు. ''ఎవరిపై ఎన్ని ఎక్కువ కేసులుంటే అంత పెద్ద పోస్టు ఇస్తా'' అంటూ నారా లోకేష్ హామీ ఇచ్చారు. దీంతో తెలుగు తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు. మహిళలపై అకృత్యాలకు తెగబడ్డారు. హద్దుదాటి ప్రవర్తించి ఎందరినో బలితీసుకున్నారు. పచ్చ మృగాళ్ల చేతిలో బలైన అమాయక మహిళలు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అయినా ఆ పార్టీ పెద్దలు మాత్రం 'తోడేళ్ల'కు మద్దతుగా నిలిచి సభ్యసమాజం సిగ్గుపడేలా చేశారు.

- కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ అనుచరుడు కె.హరి తలుపుల మండలం కుర్లి గ్రామానికి చెందిన ఓ వివాహితపై పలుమార్లు అత్యాచారయత్నం చేశాడు. దీనిపై గతంలో పంచాయితీలు చేసి వదిలేశారు. అయినా అతను పద్ధతి మార్చుకోకపోవడంతో గ్రామస్తులు పోలీసులను ఆశ్రయించారు. అంతలోపే కందికుంట వెంకటప్రసాద్ జోక్యం చేసుకుని గ్రామస్తుల దాడిలో కె.హరి గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సీన్ క్రియేట్ చేయడం గమనార్హం. ఈ ఘటన 2023 ఫిబ్రవరిలో జరిగింది.



టీడీపీ నేత కందికుంట వెంకట ప్రసాద్‌తో కె.హరి (ఫైల్)

- పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం కుటాలపల్లికి చెందిన దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి ఓ మహిళతో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. అయితే అదే మహిళతో అమర్‌నాథ్ రెడ్డి అనే వ్యక్తి సన్నిహితంగా మెలిగాడు. దీన్ని ఓర్వలేని శ్రీనివాసరెడ్డి పగ పెంచుకున్నాడు. పొలం వద్దకు వెళ్తున్న అమర్‌నాథ్‌రెడ్డిని హత్య చేశాడు. ఈ ఘటనపై మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో పాటు చంద్రబాబు, లోకేశ్, అచ్చెన్నాయుడు స్పందించారు. కేసును అధికార పార్టీపై నెట్టేసేందుకు ప్రయత్నించారు. అయితే పోలీసులు వాస్తవాలు వెల్లడించడంతో అసలు విషయం బయట పడింది. హత్య చేసిన దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి టీడీపీ కార్యకర్త అని తేలింది.



దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

- ధర్మవరం మండలం నాగలూరుకు చెందిన టీడీపీ కార్యకర్త మధు ఓ బాలికతో అమానుషంగా ప్రవర్తించాడు. బహిర్భూమికి వెళ్లిన 9వ తరగతి బాలికను బలవంతం చేశాడు. దీనిపై చిన్నారి తల్లిదండ్రులకు చెప్పగా.. పోలీసులను ఆశ్రయించారు. నిందితుడు మధు. పరిటాల శ్రీరామ్‌కు అనుచరుడిగా గుర్తించారు. మధుపై 376 సెక్షన్‌తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఉన్నాయి. ఈ ఘటన 2022 నవంబరు 27న చోటు చేసుకుంది.



పరిటాల శ్రీరామ్ అనుచరుడు మధు

... ఇలా జిల్లాలో నిత్యం ఎక్కడోచోట కొన్ని పచ్చ మృగాలు అకృత్యాలకు పాల్పడుతూనే ఉన్నాయి. ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టులు చేసి జైలుకు పంపుతున్నా బుద్ధి రావడం లేదు.

సాక్షి, పుట్టపర్తి: తెలుగు తమ్ముళ్లు బరి తెగించారు. మానవత్వం మరచి మృగాళ్లా ప్రవర్తిస్తున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు చేసిన కేసుల్లో నిందితులుగా 'తమ్ముళ్లు' ఉన్నట్లు తేలింది. కదిరి, పుట్టపర్తి, ధర్మవరం.. ఇలా ప్రతి నియోజకవర్గంలో ఓ 'తమ్ముడు' అరెస్టయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులను పోలీసులు అరెస్టు చేస్తే.. టీడీపీ నేతలు రోడ్డెక్కుతుండటం గమనార్హం. తప్పు చేసిన వాడికే మద్దతు తెలపడాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నా...వారిలో మాత్రం మార్పు రావడం లేదు.

మానవత్వం మరచి..

మహిళలను దేవతగా చూసే సంస్కృతి మనది. కానీ తెలుగుదేశం పార్టీ నేతలు ఆడవాళ్లకు కనీస గౌరవం ఇవ్వడంలేదు. మృగాళ్లలా మారి అకృత్యాలకు తెగబడుతున్నారు. ఎంతో మంది చావుకు కారణం అవుతున్నారు. ఎన్నో కుటుంబాల ఉసురు పోసుకుంటున్నారు. తప్పు చేసిన 'తమ్ముళ్ల'కు టీడీపీ నేతలు వత్తాసు పలుకుతున్నారు. బాధితుల గోడు పట్టించుకోకుండా తమ అనుచరుల కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు.

మహిళపై దాడి చేసిన టీడీపీ సర్పంచ్



ఎస్‌ఐపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ మహిళా నేత (ఫైల్)



దాడికి గురైన మహిళ

రొద్దం మండలంలోని బీదానిపల్లిలో వైఎస్సార్ సీపీ మద్దదారు మంజులపై టీడీపీ సర్పంచ్ మంజునాథ్ 2022లో దాడి చేశాడు. అప్పట్లో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తమ పార్టీ సర్పంచ్‌పై కేసు నమోదు చేయకూడదని మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, టీడీపీ మహిళా నాయకురాలు సుబ్బరత్నమ్మ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. టీడీపీ మహిళా నేత ఏకంగా ఎస్‌ఐపైనే ఎదురు దాడి చేసింది. 'బట్టలూడదీస్తాం జాగ్రత్త' అంటూ ఎస్‌ఐని బెదిరించారు.

విద్యార్థిని బలిగొన్న టీడీపీ నేత

కదిరి టీడీపీ అభ్యర్థి కందికుంట ప్రసాద్ ముఖ్య అనుచరుడు, నల్లచెరువు మండలం తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ వేధింపులతో ఓ ఇంటర్ విద్యార్థిని బలైపోయింది. తనకల్లు మండలం యర్రబల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని సంధ్యారాణిని ప్రేమ పేరుతో ఇంతియాజ్ వేధించాడు. తనను ప్రేమించకుంటే ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరించాడు. ఇంతియాజ్ వేధింపులు భరించలేక సంధ్యారాణి 2022 అక్టోబర్ 5న ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్య చేసుకొనే ముందు తన చావుకు ఫేస్ బుక్ ద్వారా పరిచయమైన నల్లచెరువుకు చెందిన రాళ్లపల్లి ఇంతియాజే కారణమని సెల్ఫీ వీడియోలో స్పష్టంగా తెలిపింది. దీంతో పోలీసులు రాళ్లపల్లి ఇంతియాజ్‌పై పోక్సో కేసు నమోదు చేసి కటకటాల్లోకి పంపించారు. సంధ్యారాణి మృతికి కారణమైన కీచకుడు ఇంతియాజ్‌ను కఠినంగా శిక్షించాలని అప్పట్లో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి.

గతంలోనూ మైనర్‌పై అఘాయిత్యం..

రాళ్లపల్లి ఇంతియాజ్ గతంలోనూ ఓ బాలికపై అఘాయిత్యం చేశాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా... ఇంతియాజ్ తరఫున వకాల్తా పుచ్చుకున్న మండల టీడీపీ పెద్దలు అతనిపై కేసులేకుండా చేశారు. అప్పటి నుంచి టీడీపీ నాయకుల అండదండలతో ఫేస్ బుక్ ద్వారా అమ్మాయిలతో పరిచయాలను పెంచుకోవడం, ప్రేమ పేరుతో నమ్మించి తన కామ వాంఛ తీర్చుకోవడం ఇంతియాజ్‌కు అలవాటుగా మారింది.



ఇంతియాజ్‌ను శిక్షించాలని రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు (ఫైల్)

కందికుంటతో రాళ్లపల్లి ఇంతియాజ్ (ఫైల్)

ఊపందుకున్న నామినేషన్లు



పెనుకొండలో నామినేషన్ వేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్



కదిరిలో నామినేషన్ దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బీఎస్ మక్బూల్

- రెండో రోజు 16 నామినేషన్ల దాఖలు
- పెనుకొండలో ఉషశ్రీ చరణ్, కదిరిలో బీఎస్ మక్బూల్ నామినేషన్ దాఖలు

పుట్టపర్తి అర్బన్: నామినేషన్ల పర్వం ఊపందుకుంది. రెండోరోజు శుక్రవారం జిల్లాలోని ఆరు నియోజక వర్గాల్లో 16 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు.

- పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ నామినేషన్ దాఖలు చేశారు. సబ్ కలెక్టర్ అపూర్వ భరత్‌కు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. అలాగే పెనుకొండ టీడీపీ అభ్యర్థి సవిత సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ వద్ద నామినేషన్ దాఖలు చేశారు.
- కదిరి నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బీఎస్ మక్బూల్ నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాలను ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణకు అందజేశారు. టీడీపీ తరఫున కందికుంట వెంకటప్రసాద్, కందికుంట యశోదాదేవి ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు.
- హిందూపురం నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున సినీ నటుడు బాలకృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు తన నామినేషన్ పత్రాలు అందజేశారు. అలాగే ఏపీ రాష్ట్ర సమితి పార్టీ తరఫున నౌషద్ నామినేషన్ దాఖలు చేశారు.
- మడకశిర నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ నామినేషన్ వేశారు. రిటర్నింగ్ అధికారి గౌరీ శంకర్‌రావుకు నామినేషన్ పత్రాలు సమర్పించారు.
- పుట్టపర్తి అసెంబ్లీ నియోజక వర్గానికి రెండో రోజు మొత్తం నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థులు కొత్తచెరువుకు చెందిన ఎస్. గంగాధర్, పాముదుర్తికి చెందిన నారాయణస్వామి, కొత్తచెరువుకు చెందిన సి.కుళ్లాయప్ప తమ నామినేషన్ పత్రాలను ఆర్డీఓ భాగ్యరేఖకు అందజేశారు.
- ధర్మవరం నియోజకవర్గంలో బీఎస్పీ తరఫున సాకే వినయ్‌కుమార్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్డీఓ. వెంకటశివరామిరెడ్డికి అందజేశారు.
- రాప్తాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరఫున వారి కుటుంబ సభ్యులు ఎంపీ గోరంట్ల మాధవ్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శంకరయ్య, ఆలిండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థి మల్లికార్జున నామినేషన్ దాఖలు చేశారు.

బాలకృష్ణ ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- ఆర్‌ఓ కార్యాలయం వద్ద హడావుడి
- 20 మందితో నామినేషన్ కేంద్రంలోకి..
- ఆర్‌ఓ కార్యాలయ సమీపంలోనే మీడియా సమావేశం



ఆర్‌ఓ కార్యాలయ ఆవరణలో నాయకులతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చిన బాలకృష్ణ దంపతులు

హిందూపురం: టీడీపీ అభ్యర్థి బాలకృష్ణ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. ఆర్‌ఓ కార్యాలయంలోకి అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే వెళ్లేందుకు అవకాశం ఉండగా, ఏకంగా 20 మందితో బాలకృష్ణ ఆర్‌ఓ కార్యాలయానికి వెళ్లారు. 15 మంది కార్యాలయ వరండాలో ఉండగా, బాలకృష్ణ, తన సతీమణి వసుంధర, మరో ముగ్గురు టీడీపీ నేతలు ఆర్‌ఓ కార్యాలయంలోనికి వెళ్లి నామినేషన్ పత్రాలు సమర్పించారు. అనంతరం ఆర్‌ఓ కార్యాలయ సమీపంలోనే బాలకృష్ణ దంపతులు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చారు. నామినేషన్ కేంద్రం నుంచి నిర్ణీత వందమీటర్లు దాటకుండానే నాయకులు, కార్యకర్తలతో కలిసి మీడియాతో మాట్లాడారు. అయినా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీన్ని సామాన్యులు తప్పుపడుతున్నారు.

ప్రజలకు తప్పని తిప్పలు..

నామినేషన్ తర్వాత బాలకృష్ణ పట్టణంలో రోడ్‌షో చేపట్టారు. సూగురు వద్ద నుంచి సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన రోడ్‌షో రాత్రి వరకూ కొనసాగింది. రోడ్‌షో కోసం హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి మండలాల నుంచి జనాన్ని తరలించడం, ఆ బస్సులను రోడ్లపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు ముందస్తుగా రహమత్‌పురం సర్కిల్ నుంచి రాకపోకలు మళ్లించినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది.

బలవంతంగా తరలింపు..

చిలమత్తూరు: బాలకృష్ణ నామినేషన్ కోసం టీడీపీ నేతలు చిలమత్తూరు నుంచి జనాన్ని బలవంతంగా తరలించారు. ఇంటింటికీ తిరిగి ఒక్కొక్కరికి రూ.500 ఇచ్చి మరీ పిలుచుకుని వెళ్లారు. అప్పటికీ కొందరు తాము రాలేమని చెబితే...'ఓటు ఎవరికైనా వేసుకోండి. ఇప్పుడు మాత్రం రండి' అంటూ బతిమిలాడారు. ఇక చిలమత్తూరులో బాలకృష్ణకు స్వాగతం పలికిన ఇక్బాల్ హిందూపురం వెళ్లలేక ముఖం చాటేశారు. ఇన్నాళ్లూ వైఎస్సార్‌సీపీలో ఉంటూ బాలకృష్ణను, చంద్రబాబును బూతులు తిట్టిన ఆయన..ఇప్పుడు వారితో కలిసి ప్రజలకు కనిపించేందుకు సిగ్గు పడుతున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభంజనం ఖాయం

- పెనుకొండలో 50 వేల మెజార్టీతో గెలుస్తున్నాం
- మంత్రి ఉషశ్రీ చరణ్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించబోతోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉషశ్రీ చరణ్ అన్నారు. శుక్రవారం ఆమె నగర పంచాయతీ పరిధిలోని కోనాపురంలో విలేకరులతో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్రంలో 151 స్థానాల్లో గెలిచిందని, కానీ ఈ ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయ దుందుభి మోగిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగనన్న ఐదేళ్ల పాలనకు జనం బ్రహ్మరథం పడుతున్నారని, అందువల్లే ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లినా అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనలో భాగస్వాములను చేశారని, అందువల్ల ఆయా వర్గాలన్నీ వైఎస్సార్ సీపీ వెంట నడుస్తున్నాయన్నారు.

పెనుకొండలో వార్ వన్‌సైడ్..

పెనుకొండలో ఇప్పటికే వార్ వన్‌సైడ్ అయ్యిందని మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. ప్రజలందరి మద్దతుతో 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తామని, పెనుకొండలో మరోసారి వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడిస్తామన్నారు. మంత్రి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు బోయనరసింహ, సుధాకరరెడ్డి, రఘునాథరెడ్డి, తయూబ్, వెంకటరామిరెడ్డి, సద్దాం, సునీల్, జయశంకరరెడ్డి, గుట్టూరు ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

వ్యయ పరిశీలన పారదర్శకంగా ఉండాలి



సమీక్షలో పాల్గొన్న నోడల్ ఆఫీసర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు అమిత్‌కుమార్

- ఎన్నికల పరిశీలకులు అమిత్ కుమార్, వినాయక్, రిథం బాజా
- జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్ష

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల వ్యయ పరిశీలన పూర్తి పారదర్శకంగా ఉండాలని హిందూపురం పార్లమెంట్ నియోజక వర్గ ఎన్నికల పరిశీలకులు అమిత్‌కుమార్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పుట్టపర్తి, మడకశిర అసెంబ్లీ నియోజక వర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు వినాయక్, రిథంబాజాలతో కలిసి కలెక్టరేట్‌లోని వీసీ హాలులో నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ... డబ్బు, మద్యం వంటి ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్టీ బృందాలు కంట్రోల్ రూం ద్వారా నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ప్రచార ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా పరిగణించాలన్నారు. ప్రత్యేక పరిశీలన బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. సమాచార లోపం లేకుండా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఏవైనా సందేహాలుంటే రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికల అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. పార్టీలు గానీ, అభ్యర్థులు గానీ అనధికారికంగా ఒక్క రూపాయి ఖర్చు చేయడానికి వీల్లేదన్నారు. అభ్యర్థుల ఆర్థిక లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక గ్రీవెన్స్ కమిటీ ద్వారా సాధారణ పౌరుల నుంచి జప్తు చేసిన నగదు ఆధారాలను పరిశీలించి త్వరిత గతిన వెనక్కు ఇవ్వాలన్నారు. అలాగే జప్తు చేసిన నగదు, వస్తువుల వివరాలను ఎప్పటికప్పుడు ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. బ్యాంకు లావాదేవీలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సీ విజిల్, 1950 టోల్‌ఫ్రీ ద్వారా అందిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కొండయ్య, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. అంతకుముందు వ్యయపరిశీలకులు కలెక్టర్ అరుణ్‌బాబును ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా తాజా పరిస్థితులపై చర్చించారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు



మక్బూల్ అహ్మద్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్

కదిరి: తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు బాబ్జాన్ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈయనతోపాటు మరో వందమంది అనుచరులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతి గడపకూ చేరుతున్నాయని, అందుకే ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని బాబ్జాన్ పేర్కొన్నారు. తాము కూడా జగన్ నాయకత్వంలో పని చేయాలనే కోరికతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. టీడీపీలో కష్టపడి పని చేసిన వారికి సరైన గుర్తింపు ఉండదన్నారు. కానీ వైఎస్సార్‌సీపీలో సామాన్యులు కూడా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు అవుతున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్ర భాస్కర్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా సాదిక్, పలువురు కౌన్సిలర్లు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీకి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడ్‌బై



రాజీనామా లేఖను మీడియాకు చూపుతున్న సురయాబాను దంపతులు

కదిరి: మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సురయ బాను టీడీపీకి గుడ్‌బై చెప్పారు. ఈ మేరకు ఆమె రాజీనామా లేఖను శుక్రవారం కదిరిలోని తన స్వగృహంలో మీడియాకు చూపించారు. ఈ లేఖను పార్టీ అధినేత చంద్రబాబు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు చెప్పారు. తాను 2014 నుంచి 2019 వరకు కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సేవలందించానన్నారు. టీడీపీ కోసం పదేళ్లుగా తనతో పాటు భర్త బాబ్జాన్ పని చేశామని, తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అయితే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎవరి సిఫార్సు లేకుండా పార్టీలకతీతంగా నేరుగా అర్హులకు అందుతుండటాన్ని అభినందించక తప్పదని అన్నారు.

నామినేషన్ వేళ.. ముహూర్తాల గోల!

ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో అత్యంత బిజీగా ఉన్నవారి జాబితాలోకి పండితులు, జ్యోతిష్యులు చేరిపోయారు. నామినేషన్ దాఖలుకు మంచి ముహూర్తం ఉంటే చెప్పాలంటూ వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు ఫోన్లు చేస్తున్నారు. మరికొందరు నేరుగా కలసి మంచి రోజులతో పాటు తమ భవిష్యత్తుపై కూడా ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో పేరు, జన్మ నక్షత్రాన్ని లెక్కలోకి తీసుకుని పండితులు మంచి రోజు ఏది, మంచి ముహూర్తం ఎప్పుడు అనేది నిర్ణయిస్తుండడం గమనార్హం.



- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొదలైన నామినేషన్లు
- పేరు, జన్మ నక్షత్రాన్ని బట్టి మంచి ముహూర్తాన్ని చూసుకుంటున్న అభ్యర్థులు
- 22, 24 తేదీలు బాగున్నాయంటున్న పండితులు
- పౌర్ణమి ఎఫెక్ట్‌తో 23న నామినేషన్ దాఖలుకు పలువురి విముఖత

అనంతపురం కల్చరల్: సెంటిమెంటు అనేది రాజకీయ నాయకులకు, సినిమా యాక్టర్లకు కాసింత ఎక్కువగానే ఉంటుందని మరోసారి రుజువైంది. ఏ పనిచేయాలన్న మంచి ముహూర్తం లేకుండా ప్రస్తుతం రాజకీయ నాయకులు అడుగు ముందుకేయడం లేదు. ఈ క్రమంలో మళ్లీ పండితులు, జ్యోతిష్కులు, న్యూమరాలజిస్టుల చుట్టూ ప్రదక్షిణలు మొదలు పెట్టారు. మరో రెండు నెలల్లో తేలనున్న భవిష్యత్తుకు నామినేషన్ల ప్రక్రియ అనేది కీలకంగా మారిన నేపథ్యంలో శుభముహూర్తాల వేట మొదలైంది. దీంతో చిన్నాచితకా పురోహితులకు కూడా బాగా డిమాండ్ పెరిగిపోయింది. మరొక విషయమేమంటే హేతువాదులుగా, నాస్తికులుగా, దేవుడిని... జాతకాలను నమ్మరాదని చెప్పుకునే కమ్యూనిస్టులు కూడా తమ స్నేహితుల వద్ద ముహూర్తాల ప్రస్తావన తెస్తుండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని తమకు అనుకూలంగా ఉన్న నియోజకవర్గాల నుంచి కమ్యూనిస్టు నాయకులు బరిలో దిగుతున్న నేపథ్యంలో వారు సైతం జ్యోతిష్కులను, పండితుల చుట్టూ తిరుగుతున్నారు.

నాలుగులో మిగిలింది రెండే..

నామినేషన్ల దాఖలకు ఈ నెల 18, 19, 22, 24 మంచి బలమైన ముహూర్తాలుగా పండితులు పేర్కొంటున్నారు. అయితే ఈ నెల 18న గురువారం అడపాదడపా కొందరు నామినేషన్లను దాఖలు చేయగా, శుక్రవారం సెంటిమెంట్ కలిసి రావడంతో 19వ తేదీ కూడా కొందరు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఈ నెల 22 చతుర్దశి, హస్త నక్షత్రం కలసి రావడంతో మంచి ముహూర్తంగా భావిస్తున్నారు. అలాగే స్వాతి నక్షత్రం కలసి వచ్చిన 24వ తేదీ కూడా ఎంతో మంచి ముహూర్తమని జ్యోతిష్కులు అంటున్నారు. అయితే 23న పౌర్ణమి కావడంతో నామినేషన్ దాఖలకు సెంటిమెంట్ అడ్డుపడుతోంది. దీంతో చాలా మంది 22, 24 తేదీల్లో నామినేషన్లను వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లుగా సమాచారం.

ముహూర్తం అనేది చాలా కీలకం



సాధారణంగా చిన్నపాటి కార్యక్రమం చేసినా ముహూర్తం చూసే పెట్టుకుంటారు. పంచాంగం చూడకుండా ఏదీ చేయడం కుదరదు. ఇక ఎన్నికలంటే చాలా మంది జీవన్మరణ సమస్యగా భావిస్తుంటారు. కొన్ని రోజులుగా చాలా మంది మంచి ముహూర్తాలు చూసి పెట్టాలని కోరుతున్నారు. నామినేషన్ల దాఖలకు ఈ నెల 22, 24 తేదీల్లో బలమైన ముహూర్తాలు ఉన్నాయి. అయితే గెలుపోటములను వారి జన్మ నక్షత్రాలే శాసిస్తాయి. కేవలం ఆత్మస్థైర్యం కోసమే జ్యోతిష్యం దోహదపడుతోంది.

– వాసుదేవరావు, జ్యోతిష్యుడు, రాప్తాడు

చంద్రుని శుభ దృష్టి అవసరం



చంద్రుని దృష్టి వల్లే శుభ, అశుభ ఫలితాలు ఉంటాయి. వాస్తవం చెప్పాలంటే ఈ సారి మంచి ముహూర్తంలోనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. తొలి రోజు పోను 19, 22, 23, 24 తేదీలు బాగున్నా వ్యక్తిగత జాతకాల ఆధారంగానే ముహూర్తం నిర్ణయించాలని చాలా మంది కోరుతుంటారు.

– కొడేకండ్ల నాగభూషణరావు, న్యూమరాలజిస్టు

రాప్తాడులో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజయం తథ్యం



తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరఫున నామినేషన్ వేసి బయటకు వస్తున్న ఎంపీ మాధవ్, తోపుదుర్తి కుటుంబ సభ్యులు

కనగానపల్లి: రాప్తాడు నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విజయం తథ్యమని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ ధీమా వ్యక్తం చేశారు. రాప్తాడులో శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తరఫున తల్లిదండ్రులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, ప్రేమకుమారి, సోదరులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డితో కలసి నామినేషన్ పత్రాలను ఆయన దాఖలు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ... శుభ దినం కావడంతో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరఫున తొలి సెట్ నామినేషన్ దాఖలు చేశామన్నారు. ఈ నెల 24న నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీతో తరలివచ్చి ప్రకాష్‌రెడ్డి మరోసెట్ నామినేషన్ దాఖలు చేస్తారన్నారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం ముందు ఎన్‌డీఏ కూటమి పటాపంచలు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు గువ్వల అంజనాదేవి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ధనుంజయ్‌యాదవ్, ఎంపీపీ జయలక్ష్మి వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, పార్టీ కన్వీనర్ జూటూరు శేఖర్, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, నాయకులు చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి, నసనకోట ముత్యాలు పాల్గొన్నారు.

యాదవులు వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలి





యాదవుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఈరలక్కప్ప. వేదికపై ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ తదితరులు, హాజరైన యాదవులు

- జగన్ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యత
- మరోసారి వైఎస్ జగన్ సీఎం అయితేనే పేదలకు లబ్ధి
- మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: బీసీలకు సముచిత ప్రాధాన్యత–గౌరవం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి యాదవులు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కోరారు. శుక్రవారం మడకశిరలోని యాదవ కల్యాణ మండపంలో నియోజకవర్గస్థాయి యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈరలక్కప్పతో పాటు వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ జగన్ పాలనలో యాదవులకు అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి కూడా మడకశిర ప్రాంతానికి ఇచ్చిన ఘనత ఆయనదేనన్నారు. ఇంకా అనేక పదవులు వచ్చాయని తెలిపారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు కూడా అందుతున్నాయని తెలిపారు. యాదవుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. తనను గెలిపిస్తే యాదవ కాలనీలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యే బరిలో ఉన్న తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఈరలక్కప్ప కోరారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రానికి మేలు: శాంతమ్మ

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి జగన్ సీఎం అయితేనే రాష్ట్రానికి మరింత మేలు కలుగుతుందని హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ పేర్కొన్నారు. మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈరలక్కప్పను, ఎంపీ అభ్యర్థిగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యాదవులను కోరారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి హామీనీ పూర్తిస్థాయిలో నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. మాట ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తారన్నారు. అలాంటి జగన్‌ను మరోసారి సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు.

టీడీపీని చిత్తుగా ఓడించండి: బోయ గిరిజమ్మ

ఈ ఎన్నికల్లో టీడీపీని చిత్తుగా ఓడించాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ కోరారు. వైఎస్ జగన్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. చంద్రబాబు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. యాదవుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. యాదవుల కోసం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, రంగేగౌడ్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, అసెంబ్లీ ఇన్‌చార్జ్ అనంతరాజు, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీరాములు, పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, సీనియర్ నాయకుడు కెంకర జయప్రకాశ్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్ నాగేంద్రయాదవ్, జిల్లా యాదవ సంఘంనాయకుడు, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి సత్యనారాయణ, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు, యువ ఓటర్లే కీలకం

ఓటర్ల వివరాలు

వయసు	ఓటర్లు
18-19	28,746
20-29	2,40,186
30-39	3,92,891
40-49	3,01,241
50-59	2,15,220
60-69	1,34,369
70-79	66,653
80పైన	18,391



గతంలో ఓ పోలింగ్ కేంద్రంలో క్యూలో నిల్చున్న మహిళా ఓటర్లు

- జిల్లాలో మొత్తం ఓటర్లు 13,97,697
- మహిళా ఓటర్లు 7,02,697
- పురుష ఓటర్లు 6,94,937

పుట్టపర్తి అర్బన్: సార్వత్రిక ఎన్నికలు ఊపందుకున్నాయి. నామినేషన్ల ఘట్టం మొదలైంది. రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేసి బరిలోకి దిగుతున్నారు. ఈసారి అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళలు, యువ ఓటర్లు కీలకం కానున్నారు. జిల్లాలోని పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, హిందూపురం, మడకశిర, పెనుకొండ, ఆరు నియోజకవర్గాల్లో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీంతో పాటు యువ ఓటర్లు సైతం లక్షలాది మంది ఉన్నారు. ఈసారి ఎన్నికల అధికారులు నెల రోజుల నుంచే వంద శాతం ఓటింగ్ లక్ష్యంగా స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధితో పాటు ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేయడం, హోం ఓటింగ్ ఏర్పాటు చేయడం తదితర కారణాలతో ఓటింగ్ శాతం పెరగనుంది. ముఖ్యంగా యువ ఓటర్లు ఓటు వేసేది ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 13,97,697 మంది ఉండగా మహిళా ఓటర్లు 7,02,697 మంది, పురుష ఓటర్లు 6,94,937 మంది కంటే సుమారు 7,760 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు.

వైభవంగా రథోత్సవం





కరకముక్కల్లో చెన్నకేశవస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు, విడపనకల్లులో సుంకలమ్మ రథోత్సవం

విడపనకల్లు: మండల కేంద్రంలో వెలసిన సుంకలమ్మ దేవి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచే విశేష పూజలు, అర్చనలు జరిగాయి. గ్రామస్తులు అందజేసిన రూ.కోటి విరాళంతో నూతనంగా తయారు చేయించిన రథాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి, అమ్మవారి ఉత్సవ మూర్తిని అధిష్ఠింపజేశారు. రథానికి పూజలు నిర్వహించిన అనంతరం అంబేడ్కర్ విగ్రహం వరకూ లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. రథోత్సవానికి చుట్టుపక్కల గ్రామాలతో పాటు బళ్లారి జిల్లా నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలిరావడంతో విడపనకల్లు జనసంద్రమైంది. అలాగే కరకముక్కలలో వెలసిన చెన్నకేశవస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొండ తిమ్మప్ప స్వామి దేవాలయంలోనూ పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఎంపీపీ పుష్పావతి, సర్పంచ్ రామాంజనరెడ్డి, ఉపసర్పంచ్ ఆదమల్ల, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు కరణం భీంరెడ్డి, రాముడ్డి, జగదీష్‌రెడ్డి, తిమ్మారెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో జిల్లాస్థాయి ప్రేరణ ఉత్సవాలు




విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో శుక్రవారం జిల్లాస్థాయి ప్రేరణ ఉత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతూ పాఠశాల స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులకు గుజరాత్‌లో ప్రభుత్వం ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు, శిక్షణ కోసం వెళ్లే విద్యార్థులకు విమాన చార్జీలు కూడా ప్రభుత్వమే భరిస్తుందని డీఈఓ మీనాక్షి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశీలకులు ఇస్మాయిల్, ఎంఈఓలు నాగరాజు, కుళ్లాయప్ప, నవోదయ ప్రిన్సిపాల్ నాగరాజు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, ఏఎంఓ మహేంద్రరెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

బాలయ్య సంతకం చాలా తేడా గురూ..

హిందూపురం టౌన్: టీడీపీ హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా సినీ నటుడు నందమూరి బాలకృష్ణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్–అఫిడవిట్‌లో బాలయ్య సంతకం చూసిన అధికారులు అవాక్కయ్యారు. ఆ సంతకంలో అనేక గీతలతో కూడిన అక్షరాలు ఉండటమే ఇందుకు కారణం. బాలయ్యే కాదు..ఆయన సంతకమూ తేడానే అంటూ చర్చించుకోవడం కన్పించింది.



బాలకృష్ణ సంతకం

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి



బహుమతులు అందుకున్న విజేతలతో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్

అనంతపురం: ఉద్యోగం చేయడం కంటే పది మందికి ఉపాధి కల్పించే ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని విద్యార్థులకు జేఎన్‌టీయూఏ రెక్టార్ డాక్టర్ ఎం.విజయకుమార్ పిలుపునిచ్చారు. జేఎన్‌టీయూఏ కళాశాల 78వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ఘన చరిత్రను కొనియాడారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. విద్యార్థులకు నచ్చిన రంగాన్ని ఎంపిక చేసుకుని అంకితభావంతో కృషి చేస్తే విజయం తథ్యమన్నారు. విద్యా ప్రణాళికలో ముఖ్యంగా క్రీడలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కార్యక్రమాలకు సైతం క్రెడిట్లు ఇచ్చినట్లు తెలిపారు. కళాశాల పురోగతికి విద్యార్థులు, అధ్యాపకులు, పూర్వ విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ సి.శశిధర్ మాట్లాడుతూ.. యువత చేతిలో దేశాభివృద్ధి ఆధారపడిందన్నారు. విద్యార్థి దశలోనే జ్ఞానంతో పాటు క్రమశిక్షణ, ఇతరులతో ఎలా మెలగాలో తెలిసినపుడే పరిపూర్ణమైన వ్యక్తిగా ఎదుగుతారన్నారు. ఈ కళాశాల విద్యార్థులు మంచి కంపెనీలు స్థాపించి, ఎంతో మందికి ఉద్యోగాలు కల్పించిన అంశాన్ని గుర్తు చేశారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కళాశాలలో గతేడాది జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ.అరుణకాంతి, స్పోర్ట్స్ సెక్రెటరీ జోజిరెడ్డి, డైరెక్టర్లు ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, ప్రొఫెసర్ డి.విష్ణువర్ధన్, ప్రొఫెసర్ ఎ.సురేష్‌బాబు, ప్రొఫెసర్ బాలనరసయ్య, ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్వింటా ఎండు మిర్చి రూ.19,500

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 195 క్వింటాళ్ల ఎండుమిర్చి వచ్చింది. ఈ– నామ్ పద్ధతిలో వేలం పాట నిర్వహించారు. ఎండుమిర్చి మొదటి రకం రూ.19,500 పలుకగా.. రెండో రకం రూ.17,800, మూడో రకం రూ.7 వేలు చొప్పున పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి.చంద్రమౌళి తెలిపారు.



మార్కెట్‌కు వచ్చిన మిర్చి